రైతుల కష్టం పందుల పాలు



మార్కెట్‌యార్డులో ధాన్యం తింటున్న పందులు

- మార్కెట్‌యార్డులో వరాహాల జోరు
- ధాన్యం గింజలపై ఎగబడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ఆమనగల్లు: ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యం గింజలపై పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. చెతికొచ్చిన దిగుబడిని చేతికందకుండా చేస్తున్నాయి. మార్కెట్‌యార్డులో ఆరబెట్టగా.. మూకుమ్మడిగా ఎగబడి ధ్వంసం చేస్తున్నాయి. తినేంత వరకు తింటూ.. తొక్కి వడ్లను పనికిరాకుండా చేస్తున్నాయి.

విక్రయించేందుకు తెస్తే..

ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం ఆరబెట్టుకోవడానికి అనువుగా సీసీ ఉంది. దీంతో రైతులు తమ దిగుబడిని యార్డు ప్రాంగణంలో ఆరబెడుతుంటారు. అనంతరం అందులో ఏర్పాటు చేసే.. కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తుంటారు. ఈ ఏడాది ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు. అయినప్పటికీ చాలామంది రైతులు తమ ధాన్యాన్ని తెచ్చి, మార్కెట్‌యార్డులో ఆరబోస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యపు గింజలపై గుంపులుగా పందులు ఎగబడి ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. యార్డులో పందుల బెడద అధికంగా ఉందని, ఇదే విషయాన్ని పలుమార్లు మార్కెట్ యార్డ్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మార్కెట్లోకి పందులు రాకుండా తగిన చర్యలు తీసుకొని, దిగుబడిని కాపాడాలని కోరుతున్నారు.

గుంపులుగా..



మార్కెట్‌యార్డులో పందులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఆవరణలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని పాడు చేస్తున్నాయి. ఆరబోసి, విక్రయిద్దామని ఎందరో రైతులు ఇక్కడికి తీసుకువస్తే.. వారి దిగుబడి పందులపాలు అవుతోంది. అధికారులు స్పందించి, పందులు రాకుండా చేయాలి. మా దిగుబడిని కాపాడాలి.

– గాజుల మల్లయ్య, రైతు, ఆమనగల్లు

గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు



అధికారులతో కలిసి చందన చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

యంత్రం అందజేయాలని హెచ్‌ఎండీఏకు లేఖ రాసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: చెరువుల్లోని గుర్రపుడెక్కను తొలగించేందుకు కార్పొరేషన్‌కు యంత్రాన్ని అందజేయాలని హెచ్‌ఎండీఏకు లేఖ రాసినట్లు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మీర్‌పేటలోని చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువులను పరిశీలించారు. చెరువులను ఆవహించిన గుర్రపుడెక్కతో తీవ్ర దుర్వాసన, దోమలు, వివిధ రకాల కీటకాలతో పరిసర కాలనీల వాసులు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. గుర్రపుడెక్క తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఆహ్లాదం, వాకింగ్ కోసం చెరువుల వద్దకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, సునీత, బోయపల్లి శేఖర్ రెడ్డి, సిద్దాల భరత్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని శనివారం సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఆదివారం అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఆపరేషన్ సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలతో పాటు పాత బిల్లుల హెచ్చుతగ్గులపై వినియోగదారులు ఫిర్యాదు చేసి, పరిష్కారం పొందాలని సూచించారు.

ఘనంగా సమాధుల పండుగ



సమాధుల వద్ద పూజలు చేస్తున్న క్రైస్తవులు

కందుకూరు: మండలంలోని జైత్వారం పరిధిలోని కేకే బస్తీలో శనివారం సమాధుల పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. నేదునూరు చర్చి ఫాదర్ శామల మైకెల్ ఆధ్వర్యంలో అందరూ గ్రామం సమీపంలోని తమ తమ కుటుంబీకుల సమాధుల వద్దకు చేరి ప్రత్యేకంగా పూజలు చేశారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు దుగ్గింపూడి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

మండల ప్రత్యేకాధికారి రామేశ్వరిదేవి



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

కడ్తాల్: సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రామేశ్వరి దేవి, ఎంపీడీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వేను శనివారం అధికారులు పరిశీలించారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శబరిమలకు భక్తుల పాదయాత్ర



జెండా ఊపి యాత్రను ప్రారంభించిన నేతలు

మంచాల: అయ్యప్ప భక్తులు శబరిమలకు కాలి నడకన బయలుదేరారు. మండల పరిధి ఆరుట్ల గ్రామం నుంచి శనివారం భక్తులు కొత్తపల్లి విష్ణు, రావుల గణేశ్‌లు సువర్ణభూమి మహా పాదయాత్రకు వెళ్తుండగా.. మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చీరాల రమేష్, కావలి శ్రీనివాస్, జంగయ్య, మాసయ్యగౌడ్, కృష్ణ, కిషోర్, రమణారెడ్డి, రమేష్, పున్నం రాము, నూకం రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ముందడుగు’తో ప్రజలకు మేలు



యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ మధు, సిబ్బంది తదితరులు

మంచాల: డిజిటల్ యాప్ ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందని సీఐ మధు అన్నారు. శనివారం సీఐ, సిబ్బంది పోలీస్‌స్టేషన్ ఆవరణలో ‘ముందడుగు డిజిటల్ న్యూస్’ యాప్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను చైతన్య పరిచే విధంగా.. వార్తలను చేరవేయాలని నిర్వాహకులకు సూచించారు. సమాజ శ్రేయస్సుకోసం ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాప్ నిర్వాహకుడు జంగయ్య, ఎస్‌ఐ లాలయ్య, ఏఎస్‌ఐ సతీష్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే ట్రస్ట్ లక్ష్యం

కడ్తాల్: ప్రజాసేవే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న ట్రస్ట్ 5వ వార్షికోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. కావున ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సుధాకర్ తదితరులు

మీర్‌పేట: శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎస్‌ఐ సుధాకర్ పేర్కొన్నారు. మీర్‌పేట నారాయణ ఐటీ ఒలింపియాడ్‌లో శనివారం జరిగిన స్పోర్ట్స్ మీట్ వేడుకలకు ఎస్‌ఐ హాజరై ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లోనూ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ప్రోత్సహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏజీఎం రవీంద్రబాబు మాట్లాడుతూ.. స్పోర్ట్స్ మీట్ పాఠశాల స్థాయి నుంచి జోనల్ స్థాయి వరకు ఉంటాయని, విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబ్జీ, ఏఓ మాధవి, ఏడీ రాజేందర్, పీఈటీలు ధరణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూపోరాటం



ఇనాం భూమిలో నిరసన వ్యక్తంచేస్తున్న మహిళలు, సీపీఎం నాయకులు

కందుకూరు: దళితుల భూములను గుంజుకుంటే సహించేదిలేదని సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ హెచ్చరించారు. సీపీఎం గ్రామ కార్యదర్శి మిద్దె యాదయ్య ఆధ్వర్యంలో మండలంలోని నేదునూరు పరిధి సర్వే నంబర్ 154లోని 1.35 గుంటల భూమిలో జెండాలు పాతి ఆరో రోజు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిజనులకు కేటాయించిన ఇనాం భూమికి సంబంధించి రికార్డుల్లో ఉన్న మునగాల వెంకట్‌రెడ్డి పేరును తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు అంకగళ్ల కుమార్, స్థానికులు ఆదిరాల నరసింహ, బొర్ర సురేష్, రంగని నరసింహ, నాగలి శ్రీహరి, శివాని, నరసింహ, మిద్దె గణేశ్, రంగని భిక్షపతి, ఆదిరాల భిక్షపతి, గోపని జగన్, జంగయ్య, మహిళలు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం

తలకొండపల్లి: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల పరిధి రాంపూర్ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం ఈఓ స్నేహలత ఆధ్వర్యంలో నూతన పాలక మండలి కొలువుదీరింది. ఆలయ చైర్మన్‌గా జిల్లెల పవన్ కుమార్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్‌గా కాకి అమృత, ఆలయ కమిటీ సభ్యులుగా ముక్తాల స్వామి గౌడ్, దనగళ్ల వెంకటయ్య, తిక్కల యాదయ్య, దుగ్గపురం జంగయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా అర్చకుడు నర్సింహ చారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా, ఆలయానికి చెందే విధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, నూతన పాలక సభ్యులపై ఉందని సూచించారు. రాంపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని లింక్ రోడ్లకు బీటీ వేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఠాకూర్ బాలాజి సింగ్, కాంగ్రెస్ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసు రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ఈఈ విజయ్ భాస్కర్‌రెడ్డి, శ్రవణ్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస చారి, కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు అంబాజీ, శ్రీనివాస మూర్తి, వెంకటయ్య, శివ, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, క్లర్క్ ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: బాలాజీ తాపీ మేస్త్రీ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కాలే శ్రీరాములు, ఉపాధ్యక్షుడుగా సిద్దిగారి మహేశ్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాపీ మేస్త్రీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గం కలిసికట్టుగా పనిచేస్తూ.. ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ సభ్యులు బాలరాజు, పోతగళ్ల కృష్ణ, సభ్యులు జంగయ్య, రాములు, పారేశ్, వీరేశ్, నర్సింహ, శేఖర్, జంగయ్య, నాయకులు నర్సింహ, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

నేడు డీఎస్పీ మహాసమ్మేళనం

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రంలో మొదటి సారిగా ధర్మసమాజ్ పార్టీ మహాసమ్మేళనం రాష్ట్ర ప్లీనరీ నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి తుల సీగారి రవీందర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ కల్వకోలు భూపాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మహాసభ జరగనుందని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పీహెచ్‌సీ సేవలు భేష్

మాడ్గుల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు బాగున్నాయని ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొత్త పాండు గౌడ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడగా.. పీహెచ్‌సీకి అంబులెన్స్ కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే సమయంలో ఖాళీగా ఉన్న పోస్టుల ను భరీ చేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం పాండు మాట్లాడుతూ.. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ నర్సింహారావు



యాచారం: సీఐ ఎ.నర్సింహారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు యాచారంలో పనిచేసిన సీఐ శంకర్‌కుమార్.. మహేశ్వరం ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. అక్కడ ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న నర్సింహరావు.. ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

టీటీడీ సభ్యుడికి సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని టీడీపీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. నగరంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో నర్సిరెడ్డిని.. ఆ పార్టీ కల్వకుర్తి ఇన్‌చార్జి యాదీలాల్ ఆధ్వర్యంలో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కండె సత్యం, అర్థం నర్సింహ, జిల్లా నాయకుడు పంచాక్షరి, గాజుల పద్మనాభం తదితరులు ఉన్నారు.

సభ్యత్వ నమోదును జయప్రదం చేద్దాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య

కొందుర్గు: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య కార్యకర్తలకు సూచించారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గుంజల్‌పహాడ్, జాకారం గ్రామాల్లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని, కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు మారుతీ చారి, శ్రీశైలం, యాదయ్య, నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలతో పాటు నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్వయం ఉపాధి కోసం నిరుద్యోగులు ఎంచుకున్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకునే దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలో మొయినాబాద్ మండల పరిషత్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఏర్పాటు చేసిన సిల్వర్ ట్రాక్ కారు బేకర్స్ స్వయం ఉపాధి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం ద్వారా స్వయం ఉపాధి కోసం నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాక్ కాలేజ్ ఫార్మసీ కళాశాల చైర్మన్ జాకీర్ ఉస్మాన్ సాబ్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మంజుల, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, పార్టీ ఎస్సీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మొత్కుపల్లి రాములు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరియాదవ్, రాఘవేందర్, షాబాద్ దర్శన్, బాకారం మాజీ ఉపసర్పంచ్ ఎలిగేపల్లి శ్రీనివాస్‌యాదవ్, జెల్లాల మల్లేశ్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు సర్వేకు వెళితే.. పాఠాలు ఎట్లా?



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

యాచారం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను కులగణన సర్వే విధుల్లో నియమించడం వలన విద్యార్థుల చదువు ఇబ్బందికరంగా మారుతుందని ఎస్‌టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టపాక ప్రవీణ్‌కుమార్, సత్తు పాండురంగారెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నం వరకే పాఠశాలలను నడిపి, ఆ తర్వాత చిన్నారులను ఇంటికి పంపితే.. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సన్నగిల్లుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 48,229 మంది ఉపాధ్యాయులు నవంబర్ నెల మొత్తం సర్వేలో పాల్గొంటే.. చదువు ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. అదే విధంగా వయోజన విద్యకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను విద్యాబోధనకు తప్ప.. మరే ఇతర పనులకు ఉపయోగించరాదని వారు ప్రభుత్వానికి సూచించారు. జూన్, జూలై నెలల్లో అడ్మిషన్లు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, అక్టోబర్ నెల మొత్తం దసరా, దీపావళి, నవంబర్ నెల మొత్తం కుల, గణన సర్వేతో విద్యార్థులకు విద్య అందించడం కష్టమే అవుతుందని వెల్లడించారు. టీచర్లకు సర్వే పనులు అప్పగించరాదని, ఒకవేళ సర్వే చేయించాలనుకుంటే.. వేసవి సెలవుల్లో సర్వే నిర్వహించాలని కోరారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి



నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి మొదళ్లగూడలోని ఎమ్మెల్సీ నివాసంలో ఫరూఖ్‌నగర్ మండలం కడియాల కుంటలో నూతనంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి శనివారం ఎమ్మెల్సీ రూ.2,22,222ల నగదును విరాళంగా నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమకు వీలైనంతలో సేవ చేయాలని సూచించారు. దేవాలయాలను నిర్మించి వదిలేయవద్దని, నిత్యం ధూప దీపం నైవేద్యాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పరిగడ్డ మాజీ సర్పంచ్ సునితచందునాయక్, మాజీ వైస్ ఎంపీపీ మానికహరికృష్ణ, మాజీ ఉపసర్పంచ్ రెడ్యానాయక్, మామిడిపల్లి మాజీ ఎంపీటీసీ కాట్న మాధవిరవీందర్, నాయకులు సేవ్యానాయక్, చందూలాల్, రమేశ్, తాన్‌సింగ్, రాంచందర్, నరేందర్ పీర్యా, శంకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా సదర్ సమ్మేళనం



సదర్ సమ్మేళనంలో నాయకులు, దున్నపోతులతో నిర్వాహకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలో సదర్ సమ్మేళనం ఘనంగా జరిగింది. దాసరి నారాయణకాలనీలో ఎనుగుల రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక యాదవులు దున్నపోతులతో నిర్వహించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సమ్మేళనంలో పాల్గొన్న అతిథులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోపియాదవ్, మహేశ్వరి, మీర్‌పేట సీఐ నాగరాజు, ఎస్‌ఐ సుధాకర్, సంతోష్‌యాదవ్, మధుయాదవ్, పాలబోని గోపియాదవ్, కడారి మధు యాదవ్ పాల్గొన్నారు.



సీఐ నాగరాజు, ఎస్‌ఐ సుధాకర్‌లను సత్కరిస్తున్న నిర్వాహకులు